| శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi |
|---|---|
| ఏప్రిల్ 2017 | April 2017 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| 1. | నేనెవరిని? | ముదిగొండ వీరభద్రయ్య | 3 |
| 2. | స్వగృహ అన్వేషణ | డా॥ వి. రామదాస్ మూర్తి | 6 |
| 3. | శంకరాచార్యులు - ఋభుగీత | | 12 |
| 4. | మోక్షము మానవులకు మాత్రమేనా? | విడపనకంటి | 15 |
| 5. | రమణునిలో రమణీయార్థాలు | ఆచార్య విజయశ్రీ కుప్పా | 21 |
| 6. | భక్త జయమాలుని కథ | మల్లాది ఫణిమాల | 24 |
| 7. | **The Five modes of Mind and Self-Enquiry** | D. Samarender Reddy | 26 |
| 9. | **Breaking the *Karmic* Cycle** | V. Krithivasan | 32 |
| 10. | **Blazing Hill** | Suddhananda Bharathi | 36 |
| 11. | **The Better Nature of Others** | T. Krishnaji | 39 |
| 12. | **Ascent to the Depth of the Heart** | Abhishikthananda | 40 |
| 13. | **Benefit of Satsang** | | 42 |
| 14. | **Testimony** | Prof. G.V. Subbaramayya | 43 |



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)**

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# నే నెవరిని?

ముదిగొండ వీరభద్రయ్య

సకల జీవులు దుఃఖమన్నది లేకుండా, ఎప్పుడూ సుఖంగా ఉండాలని కోరుతారు. ప్రతి వ్యక్తికీ తన మీదనే పరమప్రీతి ఉంటుంది. ప్రీతికి సౌఖ్యమే కారణం. మనస్సు అణగిన నిద్రలో ప్రతిరోజూ అనుభవించే తన స్వభావమైన ఆ సుఖాన్ని పొందాలంటే తనని తాను తెలుసుకోవడం తప్పనిసరి. అందుకుగాను నేనెవరిని అన్న జ్ఞాన విచారమే ముఖ్యమైన సాధనం.

సప్తధాతువుల చేత ఏర్పడినట్టి స్థూలదేహం నేను కాను. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే ఐదు విషయాలను విడివిడిగా తెలిపేటటువంటి శ్రోత్ర (చెవి), త్వక్ (చర్మం), చక్షు (నేత్రం), జిహ్వా (నాలుక), ఘ్రాణము (నాసిక) లనే జ్ఞానేంద్రియాలయిదున్నూ నేను కాను. మాట్లాడడం, నడవడం, ఇవ్వడం, మలవిసర్జనం, ఆనందాలనే అయిదు పనులను చేసేటటువంటి నోరు, కాలు, చేయి, మలద్వారం, మర్మావయవాలనే ఐదు కర్మేంద్రియాలున్నూ నేను కాను. శ్వాస మొదలయిన ఐదు వృత్తులు (పనులు) ఉన్నటువంటి ప్రాణము మొదలైన వాయు పంచకములూ (ఐదు వాయువులూ) నేను కాను. తలంచే (ఆలోచించే) మనస్సునీ నేను కాను. అన్ని విషయాలనూ, అన్ని వృత్తులనూ వదలి (కేవలం) విషయ వాసనలతో కలిసి ఉండే అజ్ఞానాన్నీ నేను కాను. పైన చెప్పిన వాటినన్నిటిని నేను కానని నేతి చేసి నిలిచేటటువంటి ఎఱుకయే నేను. ఎఱుక (తెలివిడి) యొక్క స్వరూపం సచ్చిదానందం.

సమస్తమూ తెలిసికోవడానికి, సకల వృత్తులకూ కారణం మనస్సు. అది అణగినట్లయితే జగద్దృష్టి (నేను శరీరంలో ఉన్నాను, లోకం నాకు బయట ఉన్నది అని లోకాన్ని చూడడం) వదిలిపోతుంది. లేని సర్పం ఉన్నదనుకొనే భ్రమ పోతే తప్ప ఆ సర్పభ్రమకు అడుగున నిజంగా ఉన్నది త్రాడే (రజ్జువు) అన్న జ్ఞానం కలుగునట్లు, కల్పితమైన జగద్దృష్టి వదిలితే తప్ప అధిష్ఠాన స్వరూప దర్శనం కలుగదు.

మనస్సు అన్నది ఆత్మ స్వరూపంలో ఉండే ఒక అతిశయ శక్తి. తలపులన్నింటిని అది తోపింప చేస్తున్నది. తలపులన్నిటినీ తొలగద్రోసి చూసినప్పుడు ప్రత్యేకంగా మనస్సనే వస్తువొకటి లేదు. కాబట్టి తలపే మనస్సు యొక్క స్వరూపం. జగత్తనే ఒక వస్తువు తలపుల్ని వదలి వేరేగా లేదు. నిద్రలో తలపులు లేవు. జగత్తూ లేదు; జాగ్రత్ స్వప్నాలతో తలపులున్నవి. జగత్తూ ఉన్నది. సాలెపురుగు తనలో నుంచి ఎట్లా నూలును బైటకు త్రోసి మళ్లీ దాన్నెట్లా తనలోనికి తీసికొంటున్నదో, ఆ విధంగానే మనస్సుకూడా తనలోనుంచి జగత్తును తోచేటట్లుగా చేసి మళ్లీ తనలో మఱుగుపఱుచుకొంటున్నది. మనస్సు ఆత్మ స్వరూపం నుంచి బహిర్ముఖమైనప్పుడు (బైటకువెళ్తున్నప్పుడు) జగత్తు తోస్తుంది. అందువల్ల జగత్తు తోచేటప్పుడు స్వరూపం తోచదు. స్వరూపం తోచే (ప్రకాశించే) టప్పుడు జగత్తు తోచదు. మనస్సు స్వరూపాన్ని విచారిస్తూ వెళ్తే (అంటే వెదుకుతున్నట్లయితే) ‘‘తానే’’ మనస్సయి ముగుస్తుంది. ‘‘తాను’’ అనేది ఆత్మ స్వరూపమే. మనస్సెప్పుడూ ఒక స్థూల వస్తువుని ఆశ్రయించే ఉంటుంది. అది ఒంటరిగా నిలువదు. మనస్సే సూక్ష్మ శరీరమనీ, జీవుడనీ చెప్పబడ్తున్నది.

ఈ శరీరంలో ‘‘నేను’’ అని తోచేది ఏదో, అదే మనస్సు. నేను అనే తలపు దేహంలో ఎక్కడ మొదట స్ఫురిస్తున్నదని విచారిస్తే (అది)

హృదయంలోనని తెలియవస్తుంది. అదే మనస్సు పుట్టుచోటు (ఉనికి పట్టు). నేను, నేను అని మననం చేస్తూ ఉంటే ఆ చోటికే తీసికొని పోయి చేరుస్తుంది. మనస్సులో తోచే తలపుల కన్నిటికీ నేను అన్న తలపే మొదటిది. ఇది లేచిన తర్వాతే, పుట్టిన వెనుకనే, లెక్కలేని తలపులు పుడ్తున్నవి. ఉత్తమపురుష ఐన "నేను" తోచింతర్వాతనే, మధ్యమ ప్రథమ పురుషులైన "నీవు" "వాడు" మొదలైనవి తోస్తున్నవి. ఉత్తమపురుష లేకుండా మధ్యమ ప్రథమ పురుషలుండవు.

## చందాదారులకు ముఖ్య గమనిక

2016 జనవరి సంచిక నుండి శ్రీరమణజ్యోతి 32 పేజీల తెలుగు విభాగముతో (అనగా ముందుకంటే రమారమి రెండింతలు) ప్రయోగాత్మకముగా ప్రచురించబడినది. ప్రతి నెల పత్రిక పెద్దదిగా, మరిన్ని విషయాలను చేర్చి ప్రచురించితే ఖర్చులో మార్పు ఎంత ఉండునని గమనించుటకు ఈ ప్రయత్నము చేయబడెను. అందు చేత పత్రిక చందాను పెంచకుండ 15 నెలలు శ్రీరమణజ్యోతి పత్రికను కొత్త పరిమాణములోనే విడుదల చేసితిమి. కాని పత్రిక విడుదలకు అగు ఖర్చు, చందాలతో వచ్చెడి రాబడి కంటే చాలా అధికమైనది. అందువలన తెలుగు విభాగమును 24 పేజీలకు కుదించుటకు (ఐనను 2016 జనవరి ముందుకంటే 8 పేజీలు ఎక్కువగా) చందాలో మార్పులేకుండుటకు నిర్ణయము జరిగినది. ఈ నిర్ణయము వెనక గల కారణములను చందాదారులు గ్రహించి సహకరింతురని ఆశించుచున్నాము. ద్విభాషా పత్రిక శ్రీరమణ జ్యోతి భగవాన్ శ్రీ రమణ మహర్షికి అంకితము చేయడమైనది.

# స్వగృహ అన్వేషణ

('మౌంటెన్‌పాత్' పత్రిక (సంపుటి 53, సంచిక 3, జూలై, సెప్టెంబర్ 2016)లో "హోమ్" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయం యొక్క స్వేచ్ఛానువాదం)

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

నిత్య జీవితంలో మనకు ఏమి కావాలో మనకు తెలుసునను కుంటాము. కాని అన్ని విషయాలు నిజంగా తెలియడం అరుదు. ఏవో తెలిసీ తెలియక వదరుతుంటాము. గ్రంథాలు చదివి ఏదో అర్థమైన దనుకుంటాము. పగటి కలలు కంటూ, కోరికలకు అనుగుణంగా ఆలోచిస్తాము. మనోదృశ్యం మాత్రం బూదరగా, అస్పష్టంగా ఉంటుంది. మన ''గృహం'' ''స్వస్థానం'' విషయంలో కూడా ఇదే జరుగుతుంది.

ఇంతకూ ''స్వగృహం'' అంటే ఏమిటి? మనము నివసించే కట్టడమా? మనకు అలవాటైన ప్రదేశమా. సురక్షితమని భావించే చోటా? ఉపశమనము, మానసిక శాంతిని ఇచ్చే స్థలమా? అది ఒక వ్యక్తియా, భావోద్రేక స్థితియా, లేదా వర్ధిల్లుతూ ఉండే ఒక ఆదర్శమా? అది ఒక వ్యక్తిలేక కుటుంబము అయితే వారు మన హృదయాంత రాలలో ఉన్నంత కాలము, మనము భౌతికంగా ఎక్కడ ఉంటేనేమి? కాని వ్యక్తులు ముసలి వారవుతారు, చనిపోతారు. అంటే ఆ భావన శాశ్వతం కాదన్న మాట. ఏమైనప్పటికి, విషయం ఎంత అస్పష్టంగా ఉన్నప్పటికి, ఈ స్వగృహం అన్నది ఏ రూపంలో, ఏ పరిమాణంలో, ఏ స్థలములో ఉన్నదో మనకు అవగతము కాకపోవచ్చు. కాని ప్రతి ఒక్కరికి అది ఉన్నదని మనకు జన్యు పరంపరాగత దృష్టి వల్ల తెలియ వస్తుంది, దాని కోసం వెదకుతుంటాము కూడ.

ఊరకే పదేపదే అనుకుంటూ వుండడం వల్ల ఏదీ లభించదు. వివేకి, జ్ఞాని అయిన కబీర్ ఒక పాటలో ఇలా అంటాడు: రామనామాన్ని చిలకపలుకుల్లాగ వల్లించిన మాత్రాన మోక్షం లభిస్తే - 'చెరకు' అని పలికితే నోరు తియ్యబడాలి, 'మంట' అంటే కాళ్ళు కాలాలి; 'నీరు' అంటే దాహము తీరాలి; 'తిండి' అంటే కడుపు నిండి త్రేపులు రావాలి; 'ధనం' అన్న మాత్రాన ధనికుడైపోవాలి, ఇక ఎక్కడ కూడా భిక్షమడిగే వారుండరు - అని దాని భావము.

జీవితం అంటేనే మార్పులు, కదలికలతో కూడుకున్నది. ఏదీ ఎక్కువ కాలము నిలకడగా ఉండదు. మనము అతిగా ఇష్టపడే ఆహారము కూడ వెగటు పుట్టిస్తుంది. ప్రగాఢమైన శాంతి అనుకున్న స్థితి విసుగ్గా అనిపిస్తుంది. మనము విధిని యథాతథంగా అంగీకరించి నప్పుడు కాలచక్రం ముందుకు సాఫీగా సాగుతున్నట్లు తోస్తుంది. మరొక క్రొత్త విషయం లేదా ఏదైన తప్పించుకోలేని సంఘటన హఠాత్తుగా ఎదురు పడినప్పుడు మన నెమ్మది, సమతుల్యత దెబ్బతింటాయి. ఒక కఱకు మాట, ఒక్క దురుసు నడత ఎవరినుండినైన ఎదుర్కొంటే చాలు, బుఱ్ఱ వేడెక్కి పట్టరాని కోపం వస్తుంది. కాని జీవితం మాత్రము మనల్ని సాగిపోతూ వుండమని ముందుకు తోస్తూనే ఉంటుంది. అందుకే ఈ దృష్టితో చూసినప్పుడు 'గృహం' అంటే ఒక భౌతికమైన స్థలం కాదు, ఒక మానసిక స్థితి. తమ చిన్ననాటి గృహ పరిసరాలకు ఆ తరువాత ఎప్పుడో తిరిగి వచ్చిన వారు, అక్కడ తమని తామే అపరిచితులుగా భావించిన సందర్భాలు ఎంతమందికి కలుగవు? అక్కడ తమకు ఒకప్పుడు సుఖానుభూతి, భద్రత కలిగి వుండిన కారణంగా ఆ చోటు గృహమని భావించబడేది. కాని అవి ఇప్పుడు జ్ఞాపకాలుగా మాత్రమే మనోపుటలలో వుండిపోతాయి.

భగవాన్ ఒక వ్యక్తి అనుకుందామా? అలా భావించడానికే మనము ఇష్టపడతాము. కాని మన తెరలను తొలగించుకుని మనలోతుల్లోనికి వీక్షించే ఆ జాజ్వాల్యమైన కళ్ళను తిలకిస్తే, వణుకు పుట్టుకు రాక తప్పదు. మనలో చాలామంది అరుణాచలము, రమణాశ్రమ ప్రాంతము స్వగృహమని భావిస్తాము. ఆ గిరి, అక్కడి కట్టడాలు, ఆ పరిసర ప్రాంతాలతో మనకు సన్నిహిత సంబంధము ఉన్నట్లు అనిపిస్తుంది. కారణమేమిటో చెప్పలేము. ఏమైన మనము ఉండవలసినది అక్కడ అని తలుస్తాము. కాని కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ అవసరాలు, ఆరోగ్య ఇబ్బందులు మనల్ని అలా ఉండనివ్వవు. ఇక వేసవిలోనైతే, కొలిమిలో పెట్టి కరగబెడుతున్నట్లు ఉంటాయి అక్కడి వేడిగాలులు. అక్కడ నివసించే వారి అదృష్టాన్ని చూసి మనము ఈర్ష్య చెందుతాము. కలతలు, వ్యాకులతల నివారణకు అరుణాచల ప్రాంత నివాసం ఉత్తమ పరిష్కారమని చాలామంది భావిస్తారు. అక్కడి పవిత్ర వాతావరణం నిశ్చలత్వాన్ని కలిగి వుంది, అమితమైన ప్రశాంతతను వెదజల్లుతూ వుంటుందను కుంటాము. ఆ శక్తిపూరిత మైన క్షేత్రములో మన కలతలు, భయాలు, కోరికలు అన్నీ పేలవమై వెలవెలబోతాయి. అక్కడ ప్రతి ఒక్కటి సంపూర్ణము, సక్రమము, మచ్చలేనిదని కలలు కంటాము.

నిజానికి, తిరువణ్ణామలై ఒక పర్యాటక ప్రదేశమో లేదా ఆ పరిసరాలు తన్మయం, ఉద్విగ్నంతో సంతోషపరిచే స్థలమో కాదని అక్కడ ఏ కొంత కాలము నివసించినవారైనా చెబుతారు. ఇక రెండవది, అక్కడ చేరిన తరువాత ఒక ఉన్నత శక్తి, దాన్ని ఏ రూపంలో భావించినప్పటికి) కి శరణాగతి చెందడంలో అది ఎన్నో క్రొత్త

విషయాలను నేర్చుకొనవలసిన ప్రదేశమని అర్థమవుతుంది. ఒకసారి అరుణాచలమే మన స్వగృహం, నివాసానికి తగిన స్థలమని నిశ్చయించుకున్న తరువాత, మన హృదయాన్ని, మనసును సుశీలంగా, అపకీర్తికిలోను కాని విధంగా మన ప్రవర్తన ఉండాలన్నది విశదమవు తుంది. అశ్రద్ధ, అజాగ్రత్తతో వ్యవహరించే ఆషామాషీ పర్యాటకులుగా ఉండడానికి వీలులేదు.

భక్తిభావంతో గాని, ఏదో కుతూహలంతోగాని భగవాన్ వద్దకు వచ్చిన వారెవరైనా, ఎంతో మర్యాదతో, సౌజన్యపూర్వకంగా ఆహ్వానించ బడతారు. భగవాన్‌ను గురువుగా భావించినప్పుడు, సరియైన పద్ధతిలో నిర్దేశించిన విధంగా ప్రవర్తించవలసిన బాధ్యత మీద పడుతుంది. సభ్యులను ప్రేమ, దయతో చూచుకునే కుటుంబపెద్దగా భగవాన్ కనిపించవచ్చు. కాని సాధకుని విషయానికి వచ్చేసరికి నియమాలను ఖచ్చితంగా అనుసరిస్తేగాని వారు అంగీకరించరు. ఇక ఈ విషయంలో మన్నించడం, తప్పించుకునే అవకాశం ఇవ్వడమంటూ ఉండదు. మన ప్రయత్నంలో ఏ లోపమూ లేదని ఆయనకు నమ్మకం కుదిరితే మాత్రం మనలో ఏవైనా బలహీనతలు ఉన్నప్పటికి దయార్ద్ర హృదయంతో క్షమిస్తారు. మన విషయం మనకంటే బాగా భగవాన్‌కే తెలుసు. మనము ఊహించుకునే దానికంటే మెరుగైన సామర్థ్యం మనకు ఉందని కూడ ఆయనకు తెలుసు. సాధనాక్రమంలో ఎప్పుడైన మనము దిక్కుతోచక కొట్టుకుపోతూ ఒక్క క్షణం కూడ ముందుకు పోలేక మునిగిపోతున్నామని భావించే దశలో, తీరాన్ని సురక్షితంగా చేరడానికి అవసరమైన ధైర్యాన్ని, సహనం, ఓర్పులను భగవాన్ ప్రసాదిస్తారు. కాని గట్టు చేరాలనే ప్రథమ ప్రయత్నం మాత్రము మనము చేసి తీరాలి.

నిరంతరము మనచుట్టూ పరధ్యానము కలిగించే విషయాలు, సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం అవకాశమిచ్చిన మన మనసు వీటికి లోబడి ఏకాగ్రతను కోల్పోతుంది. ఇంతకూ మనసంటే ఏమిటి? అస్థిరమైన ఆలోచనల మూట, భావోద్రేకాల మూలస్థానము. వాటిని సక్రమ మార్గంలో నడిపించి, స్వచ్ఛమైన చిత్త వృత్తిలో ఉంచడము మన ప్రయత్నమై ఉండాలి. మన స్వస్థానం అరుణాచల రమణులే నన్నస్థిరమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటే బాధ లేదు. మనము భౌతికంగా ఆయన సన్నిధిలో ఉన్నట్లు మన జ్ఞాపకాల ద్వారా కూడ భావించుకొనవచ్చు. ఆశ్రమములోని అగరు వత్తుల సువాసన, పువ్వుల సుగుంధం, నెమళ్ళ కేకలు, వేదం లేదా తమిళ పారాయణ పవిత్ర స్వరాలను ఊహించుకుంటే చాలు అవి మనము అక్కడ ఉన్న భావనను కలిగించగలవు.

మనసుకు ఏదీ దూరమంటూ లేదు. ఒక్క అంగలో అన్ని అడ్డంకులను తొలగించుకొని ముందుకు సాగగలము. దుఃఖం, సంతోషం మరే ఇతర తీవ్రమైన భావోద్రేకాలు ప్రకటితమైనప్పుడు మనసే మనము ఉన్న చోటి నుండి మనము ఉండాలనుకున్న చోటికి చేర్చే ఒక దృఢమైన వారధిగా పనిచేస్తుంది. ఇక ప్రియమైన వారికొరకు తపన పడే సమయములోనైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

మరపు అన్నది మనకు ఒక బద్ధ శత్రువు. ప్రతిక్షణము మనము చేసే పని ఎఱుకతో చేయాలి. మన భక్తి శ్రద్ధలు, తీవ్రమైన ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశ్యము ఒకటే - అసలైన దానిపై ధ్యాస ఉంచి జ్ఞాపకము పెట్టుకొనడం. ఒక దిశలో మన ఆలోచలనను నిర్దేశించాలి. కాని అందుకు మనకు భగవాన్ కృప ఖచ్చితంగా అవసరము.

ఆర్థర్ ఆస్‌బార్న్ తన ఆత్మకథలో భగవాన్‌ను తాను దర్శించిన క్షణంలోనే ఆయన గురువు కాదన్న తన పూర్వభావన ఆయన ప్రకాశ పూరిత కృపా దృష్టితో పూర్తిగా ఆవిరైపోయినదన్నాడు. భగవాన్ బోధన ఆచరణీయమైన మార్గదర్శకము కాదన్న తప్పుడు అభిప్రాయము తొలగి పోయిందని వ్రాశాడు. సాధకులను ఆచరించ గల మార్గము వైపుకు మళ్ళించడమే భగవాన్ బోధనల ఉద్దేశ్యమని ఆస్బార్న్ అన్నారు.

అలవాటు చొప్పున మనము తక్షణమనోరథ సిద్ధిని ఇచ్చే వాటిని తప్ప మిగిలినవాటిని యోగ్యమైనవిగా పరిగణించము. మనము "స్వగృహం" "స్వస్థానం" నుండి బహిష్కృతులు కావడానికి కారణము ఇదే! మనము ముందుగా స్థిరపడివుండక పోతే, మరణము చాలా బాధాకరమైన అనుభూతిగా ఉండక తప్పదు. నిక్కచ్చిగా చెప్పాలంటే ఈ క్రింది రెండింటిలో ఏదో ఒక దానిని కోరుకొనడమే. ఊరు, పేరు లేకుండ జీవితకాలంలో ఏమీ నేర్చుకొనలేని వాడిలా చనిపోవడమా, లేదా వివేచనతో, ప్రాపంచిక విషయాల పట్ల నిరాసక్తత చూపి, చివరకు స్వస్థానాన్ని చేరుకోబోతున్నామన్న సంతోషంతో వెళ్ళిపోవడమా? ఈ రెండింటిలో ఏది సరియైనదో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు.

"అక్షరమణమాల'లో భగవాన్ "నీ కృప ఎంత గొప్పది, లోదూరి లాగి నీ లోగుహను చేరగాను అనుసరించితే మొకో అరుణాచలా!" అన్నట్లు మనమూ ఏదో ప్రార్థిస్తూ ఏదో ఒక రోజు ఈ లోకం నుండి నిష్క్రమించ గలగాలి. అదే మన స్వగృహం, అదే మన స్వస్థానం.

* * *

# శంకరాచార్యులు - ఋభుగీత

(శ్రీరమణజ్యోతి ఆగస్టు 2016 సంచికలో ప్రచురితమైన వ్యాసం యొక్క అనువాదం)

తమిళనాడులోని కుంభకోణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో తిరునిదై మరుదూర్ అని ఒక చిన్న పట్టణం ఉంది. కనీసం 2000 సం॥ల ప్రాచీనమైన అక్కడి దేవాలయంలో కొలువైన దేవుడు మహాలింగ స్వామి. ఆదిశంకరాచార్యులకు, ఈ దేవాలయానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన కథ ఉంది. అద్వైత సిద్ధాంత ప్రచారం నిమిత్తం ఆదిశంకరులు ఈ దేశం నలుమూలల మూడుసార్లు సంచారం చేశారన్న సంగతి మనకు తెలిసిన విషయమే. ప్రామాణిక ఆధారాలతో కూడిన తమ పటిష్టమైన వాదనలతోను, తమ ఆధ్యాత్మిక శక్తితోను ఆదిశంకరులు అన్ని చోట్ల అద్వైత తత్వం యొక్క బలాన్ని నిరూపింప జేయగలిగినప్పటికి, తిరునిదై మరుదూర్ లోని బ్రాహ్మణులను మాత్రం ఒప్పించ లేకపోయారు. వారు ఈ తత్వాన్ని అంగీకరించలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న శంకరులు ఆ ఊరికి వచ్చారు. అక్కడి బ్రాహ్మణులు మాత్రం ఆలయంలోని స్వామి స్వయంగా ఈ అద్వైత తత్వం సరియైనదని అంగీకరిస్తే తప్ప తాము నమ్మలేమని చెప్పారు. కేవలం తర్కపూర్వక వాదనలతోను, బుద్ధి బలంతోను, నమ్మించడానికి ప్రయత్నం చేయవద్దని అన్నారు. శంకరా చార్యులు ఈ సవాలును అంగీకరించారు.

అందరూ ఆలయంలోనికి వెళ్ళారు. శంకరులు మహాలింగ స్వామిని పొగడుతూ కొన్ని శ్లోకాలు చదివారు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. శివలింగంపై నుండి ఒక చేయి పైకి వచ్చింది. దైవవాక్కు ఇలా

వినిపించింది: "అద్వైతం సత్యం, అద్వైతం సత్యం, అద్వైతం సత్యం". అలాగ మూడుసార్లు ఉచ్చరించబడిన ఆ ప్రకటనను విని, భరోసా ఇస్తున్నట్లు పైకి ఎత్తబడిన ఆ చేతిని చూడడంతో మూర్ఖంగా వాదిస్తూ వచ్చిన అక్కడి బ్రాహ్మణులు అద్వైత సిద్ధాంతం సరియైనదన్న వాదనను అంగీకరించారు.

పై వృత్తాంతానికి సంబంధించిన మరొక సంఘటన కూడ ఉంది. భగవాన్‌కు దగ్గరగా ఉన్నందున అది మనకు మరింత ఆసక్తికరమైనదిగా ఉంటుంది. మొదటి రోజుల్లో తిరునిదై మరుదూర్ లోని బ్రాహ్మణుల అద్వైత తత్త్వ వ్యతిరేక తీరును సరిదిద్దడానికేమో కాబోలు కొన్ని శతాబ్దాల తరువాత ఆ వంశంలో భిక్షు శాస్త్రి అనే ఒక ఉన్నత అద్వైత సిద్ధాంత పండితుడు జన్మించాడు. అతడు ఋభు గీతాన్ని 44 అధ్యాయాలలో చక్కని తమిళ పద్యాల రూపంలో అనువదించారు. మూల గ్రంథం కంటే కూడ అనువాద గ్రంథం ఎంతో అద్భుతంగా ఉందని భగవాన్ అభిప్రాయం. అందుకే ఆ తమిళ పద్యాలను పాడుతూ వుండాలని తీవ్ర సాధకులను భగవాన్ ప్రోత్సహించేవారు. ఆ గ్రంథంలోని 26వ అధ్యాయాన్ని చదివితే సమాధిలోనికి పోవడం సాధ్యమవుతుందని వారు అనేవారు. 1930 సం॥ కాలంలో తమిళ ఋభు గీతాన్ని క్రమం తప్పకుండా పఠించే కార్యక్రమం ఆశ్రమంలో జరుగుతుండేది. ఆశ్రమం వారు 1996 సం॥లో ఆ పుస్తకాన్ని తిరిగి ముద్రించారు.

స్థిరమైన అద్వైతవాది అయిన భిక్షు శాస్త్రి తమిళ అనువాదంలో నిర్గుణ బ్రహ్మంను గురించి మాత్రమే పేర్కొన్నారు. శివుడు, విష్ణువు మొదలైన దేవుళ్ళను ఆయన మిథ్యగా మాత్రమే భావించడం వల్ల వాళ్లను గురించిన ప్రస్తావన ఎక్కడ తీసుకురాలేదు. కాని సగుణ

బ్రహ్మన్ ఈశ్వరుని ఇచ్ఛ మరొక విధంగా ఉండేది. ఈశ్వర కృప మాత్రమే ఆత్మకు అద్వైత పరిమళాన్ని అందించగలదన్న విషయాన్ని తెలియబరచడానికి ఒక లీలను ప్రదర్శించాడు. చిన్న వయసులో ఉన్న భిక్షు శాస్త్రి కంటి చూపును పూర్తిగా కోల్పోయాడు. తన పరిస్థితిని గురించి తీవ్రంగా ఆలోచించిన ఆయన సగుణబ్రహ్మమైన ఈశ్వరుని పూర్తిగా మరచి ప్రజలకు తాను తప్పుడు సంకేతాలను పంపుతున్న విషయాన్ని గ్రహించాడు. దానిని సరిదిద్దడానికి నిశ్చయించుకున్నాడు. అందుకే ప్రతి అధ్యాయం చివర, ఆ నిర్గుణ బ్రహ్మన్‌కు సన్నిహితుడైన చిదాకాశవాసి చిదంబరంలోని ప్రభువును పొగడుతూ ఒక పద్యాన్ని జతపరిచాడు. అలాగ నటరాజస్వామిని స్తుతిచేస్తూ ఆయా అధ్యాయ సారాంశాన్ని తెలియబరిచే రచన చోటు చేసుకుంది.

ఆ తరువాత భిక్షుశాస్త్రి తన నేత్ర దృష్టిని తిరిగి పొందాడని ప్రతీతి.

## సంపాదకీయ బృందమునందు మార్పు

తెలుగు సంపాదకీయ బృందమునందు మార్పు కలదు. శ్రీ ఎస్.వి. రాజేశ్వర్ మరియు శ్రీ పి.వి. లావణ్యా రావు వారి వారి వ్యక్తిగత కారణముల రీత్యా సంపాదకీయ బృందమునందు పనిచేయుటకు వీలు కానందున వారి స్థానములందు డా॥ వి. రామదాస్ మూర్తి , శ్రీమతి మల్లాది ఫణిమాల మరియు శ్రీమతి కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి శ్రీరమణజ్యోతి తెలుగు విభాగము నందు సంపాదకీయ సభ్యులుగా ఉందురు. శ్రీ ఎస్.వి. రాజేశ్వర్ మరియు శ్రీ పి.వి. లావణ్యారావు గార్ల విశిష్ట సేవలను కేంద్రం ప్రశంసిస్తున్నది.

# మోక్షము మానవులకు మాత్రమేనా?

(శ్రీరమణజ్యోతి సంపుటి 36, సంచిక 2, ఫిబ్రవరి 2016లో ''ఈజ్ డెలివరెన్స్ రిజర్వ్డ్ ఓన్లీ ఫర్ హ్యూమన్స్'' శ్రీ కృత్తివాసన్ గారి వ్యాసం యొక్క అనువాదం)

ఆశ్రమ గోవు లక్ష్మి మోక్షాన్ని పొందిందని ఒక పద్యరూపంలో భగవాన్ ధృవపరచిన మూడు రోజుల తరువాత సూరినాగమ్మగారు తమ (జూలై 21, 1948) లేఖలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని తెలిపారు. ఒక భక్తుడు ఆ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, ''స్వామీ, జంతువులు, పక్షులు మీ సమక్షంలో మోక్షం పొందడం గమనిస్తున్నాము. మరి మానవులు మాత్రమే మోక్షాన్ని పొందగలరన్నది నిజం కాదా?'' అని అడిగారు. భగవాన్ చిరునవ్వుతో, ''ఎందుకు? ఒక గొప్ప సాధువు ఒక ముళ్ళ పొదకు మోక్షాన్ని ప్రసాదించార''ని చెప్పబడింది. ఆ భక్తుడు ఎంతో ఆతురతతో, ''ఎవరు ఆ గొప్ప వ్యక్తి, ఆ ముళ్ళపొద కథ ఏమిటి'' అని అడిగాడు. భగవాన్ చెప్పిన కథ సూక్ష్మంగా ఇలా ఉంది.

చిదంబరంలోని దీక్షితార్ (బ్రాహ్మణ) కుటుంబంలో ఉమాపతి శివం జన్మించాడు. దీక్షితార్ వర్గీయులు పారంపర్యంగా చిదంబర నటరాజ స్వామి ఆలయంలో అర్చన కార్యక్రమాలను నిర్వర్తించే ప్రత్యేక హక్కు కలిగి వుండేవారు. తమిళ, సంస్కృత శాస్త్రాలను గొప్పగా అభ్యసించి ఉమాపతి శివం శివాచార్యుడిగా పేరు పొందాడు. అతను దైవవశాత్తు ఒకసారి మరైజ్ఞాన సంబంధర్ అనే మరొక గొప్ప శైవ యోగిని కలవడం జరిగింది. ఆయనకు శిష్యుడు కావాలని ఉమాపతి శివం నిశ్చయించుకున్నాడు. సామాజికంగా తక్కువ వర్ణానికి చెందిన మరై

జ్ఞాన సంబంధర్‌కు ఉన్నత వర్ణానికి చెందిన ఉమాపతి శివం శిష్యుడు కావడాన్ని ఇతర దీక్షితార్లు ఎవ్వరూ అంగీకరించలేదు. ఉమాపతి శివంను సంఘబహిష్కృతిడిగా చేసి చిదంబరం నుండి బలవంతంగా వెళ్ళగొట్టారు. నగరం వెలుపల ఒక మఠాన్ని ఏర్పరచుకుని ఉమాపతి శివం శివారాధనలో కాలం గడపడం మొదలు పెట్టారు. ఉమాపతి శివం యొక్క గొప్పతనాన్ని ప్రజానీకానికి తెలియజెప్పాలని నిశ్చయించు కున్న శివుడు ఒక లీలను ప్రదర్శించాడు.

ఆ కాలంలో చిదంబరంలో పేట్టన్ సాంబన్ అనే ఒక వెలివేయ బడిన వ్యక్తి ఉండేవాడు. తక్కువ వర్ణానికి చెందినందున అతడు చిదంబరంలోని ఆలయంలోనికి వెళ్ళడానికి అనర్హుడు. కాని ఆ కారణం అతని అపారమైన శివభక్తికి ఏ రకంగాను అడ్డురాలేదు. తాను ఎక్కడ ఉన్నా, ఏ పని చేస్తున్నప్పటికి, నిరంతరం శివునిపై నుండి ధ్యాసను మరల్చేవాడు కాదు. అతని అచంచలమైన భక్తికి మెచ్చిన శివుడు సాంబన్ ఎదుట తన సంపూర్ణ రూపంతో, త్రిశూలం, గొడ్డలి, జింక మొదలైన అన్ని ఆయుధ, చిహ్నాలతో సహా ప్రత్యక్షమయ్యాడు.

సంభ్రమాశ్చర్యాలతో తబ్బిబ్బయిన సాంబన్‌ను ఏదైనా వరాన్ని కోరు కోమన్నాడు శివుడు. సాంబన్ ‘‘నాకు మోక్షం కావాలి. అది తప్ప మరేదీ వద్దు’’ అన్నాడు. అప్పుడు శివుడు తాటాకు మీద ఒక సందేశాన్ని వ్రాసి ఇచ్చారు. అందులో ‘‘ఈ ఆదేశం చిదాకాశవాసి, భక్తులందరికి సౌలభ్యుడు అయిన ఉమాపతికి ఉద్దేశింపబడింది. నీవు పేట్టన్ సాంబన్‌కు సాంఘికంగా భిన్నభావంతో చూడబడే దృష్టి తొలగించబడే లాగ దీక్షను ఇవ్వవలసిందిగా ఇదే నా ఆజ్ఞ’’ అని వుంది.

శివుడు అప్పుడు సాంబన్‌కు ఆ చీటీని ఇచ్చి, ఉమాపతి శివంను అతని మఠంలో కలిసి ఇమ్మన్నాడు. అడుగువర్గానికి చెందిన తాను నేరుగా ఉమాపతి శివంను ఎలా కలవడం అన్న సందిగ్ధంలో సాంబన్ పడ్డాడు. కాని పరిస్థితులు ఎలాగో అనుకూలించడంతో ఉమాపతి శివం సమక్షానికి చేరాడు. ఆయన కాళ్ళమీద పడి ప్రణమిల్లి శివుడు తనకు ఇచ్చిన ఆ తాటాకు చీటీని ఉమాపతి శివంకు అందజేశాడు. దాన్ని చదవగానే సంభ్రమంతో పరవశుడైన ఉమాపతి శివం శివాజ్ఞను శిరసావహించి సాంబన్‌కు వెంటనే నయన దీక్ష (కళ్ళ ద్వారా) ను ఇచ్చాడు. అప్పటికే ఉన్నతశ్రేణి భక్తుడైన సాంబన్, ఉమాపతి శివం యొక్క దృష్టి పడిన వెంటనే జ్యోతిగా మారి, భౌతికంగా మాయమై చిదాకాశంలో లీనమయ్యాడు.

ఎంతసేపటికి సాంబన్ తిరిగిరాకపోయే సరికి ఏమైందో తెలుసుకునేందుకు అతని భార్య మఠానికి వచ్చింది. సాంబన్‌కు మోక్ష ప్రాప్తి అయిందని, భౌతికంగా లేకుండ అతను మాయమయ్యాడని చెబితే ఆమె అసలు నమ్మలేదు. రాజుగారి దగ్గరికి వెళ్ళి ఉమాపతి శివం తన భర్తను చంపాడని ఫిర్యాదు చేసింది. అసలు సంగతి ఏమిటో స్వయంగా విచారిద్దామని రాజు సపరివారంగా మఠానికి వచ్చాడు. సాంబన్ గురించి ప్రశ్నించినప్పుడు అన్ని విషయాలు ఉమాపతి శివం రాజుతో చెప్పాడు. శివుడు తనకు చీటీని వ్రాసి పంపడం, తాను సాంబన్‌కు నయనదీక్ష ఇవ్వడం. దాంతో పేట్టన్ సాంబన్ చిదాకాశంలో లీనం కావడం, అన్ని విశదంగా తెలిపాడు. తాను విన్న సంగతులు అసలు నమ్మశక్యం కానివిగా రాజుకు అనిపించింది. అయినప్పటికీ, ఉమాపతి శివం చెప్పినవి నిజమని నిరూపించడానికి అతనికి ఒక అవకాశం ఇవ్వాలన్న

ఉద్దేశ్యంతో రాజు తన సమక్షంలో ఇంకెవరికైనా మోక్షాన్ని ప్రసాదించమని సవాలు విసిరాడు. ఆ ప్రాంగణంలో ఉమాపతి శివం ప్రతిరోజు శివాభిషేకం చేసినప్పుడు లింగం నుండి ప్రవహించిన తీర్థంతో పెరిగిన ముళ్ళపొద ఒకటి ఉండేది. ఉమాపతి శివం దాన్ని ఎంచుకుని దానికి నయనదీక్ష ఇవ్వడంతో, ఆ పొద జ్యోతిగా మారి చిదాకాశంలో కలిసి భౌతికంగా మాయమైంది.

ఆ సంఘటనతో రాజు అత్యాశ్చర్యం చెందినప్పటికి, ఉమాపతి శివం చేసినది నిజంగా మోక్ష ప్రధానమా, లేదా ఆ మొత్తం మాయాజాలమా అని సందేహపడి మరొక పరీక్ష పెట్టాడు. “నీకు నటరాజస్వామి ఒక తాటాకు చీటి ఇచ్చారన్నావు కదా, మనం దేవాలయానికి వెళ్ళి స్వామినే అడుగుదాం” అని అన్నాడు. స్వామి ఏమి చెబుతాడో అన్న ఉత్కంఠతో అందరూ దేవాలయం చేరారు. పూజ జరిగిన తరువాత కర్పూర హారతి ఇచ్చినప్పుడు నటరాజస్వామికి ఇరుప్రకకల సాంబన్, ముళ్ళపొద కనిపించాయి. దేవాలయంలోనే యదార్థం ఏమిటో తేలిన తరువాత అందరూ ఉమాపతి శివం గొప్పతనాన్ని మెచ్చుకుని అతనికి క్షమాపణలు తెలుపుకున్నారు. “శ్రీరమణ రెమెనిసెన్సెస్” అన్న తమ పుస్తకంలో జి.వి. సుబ్బరామయ్య గారు జంతువులు, మొక్కలు కూడ కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఆత్మానుభవ సిద్ధి పొందగలవని భగవాన్ చెప్పినట్లు వ్రాశారు. గోవు లక్ష్మి మోక్షప్రాప్తికి ముందే అది వ్రాయబడింది.

ఇది ఇలా ఉంటే, వైష్ణవ సంప్రదాయ సాహిత్యంలో కూడ ఇలాంటి ఒక సంఘటన తెలియవస్తోంది. చిన్ని కృష్ణుడు గోపికల ఇళ్ళలో జొరపబడి వెన్న దొంగిలిస్తుండే వాడు. ఒక రోజు కృష్ణుడు ఒక గోపిక ఇంట్లో వెన్నకుండ పై కప్పు నుండి కొక్కేనికి వేలాడదీయ బడి వున్నది

చూశాడు. కుండను గంటలతో అలంకరించారు. వెన్న కోసం కృష్ణుడు కుండను కదిలించినప్పుడు గంట మ్రోగడం మొదలైంది. తాను దొంగతనానికి వచ్చిన విషయాన్ని బయట పెట్టినందుకు కృష్ణుడు గంటను తిట్టాడు. ఆ గంట తనను సమర్థించుకుంటూ "నేనేమి చేయను? నీకు ప్రసాదం నివేదించే సమయంలో గంట కొట్టడం ఆనవాయితీ. నీవు నోట్లో వెన్న పెట్టుకుంటుండగానే నేను మ్రోగాల్సి వచ్చింది" అన్నదట.

ఏది ఏమైన, గంట శబ్దం విన్న గోపికలు కృష్ణుడిని పట్టుకునేందుకు తరుముకు వచ్చారు. దాగుకునే స్థలం వెదకుతూ, కృష్ణుడు ఆ వీధి చివర ఒక ఇంట్లోకి దూరాడు. అది దధిపాండన్ ఇల్లు. అక్కడ ఎన్నో కుండలలో పెరుగు నిలువ చేయబడి వుంది. వాటి మధ్యలోని ఒక ఖాళీ కుండలోకి కృష్ణుడు దూరి దాక్కున్నాడు. ఇదంతా గమనిస్తున్న దధి పాండన్ ఆ కుండ మీద కూర్చున్నాడు. కృష్ణుణ్ణి వెదకుతూ గోపికలు వస్తే, అతను అక్కడికి రానేలేదని దధిపాండన్ బుకాయించి పంపి వేశాడు. అలా కృష్ణుడు గోపికల నుండి అప్పటికి కాపాడబడ్డాడు. కుండ నుండి బయటికి రావాలని కృష్ణుడు ప్రయత్నిస్తుంటే దధిపాండన్ లేవకుండా, అవకాశాన్ని సద్వినియోగపరచుకుందామనుకున్నాడు. ఈ సంసార బంధాల నుండి నన్ను విముక్తిడిని చేస్తావని నీవు మాట ఇస్తే తప్ప నిన్ను కుండ నుండి బయటకు రానివ్వనని కృష్ణుడితో అన్నాడు. ఎలాగైనా కుండ నుండి బయటపడాలన్న ఆదుర్దాతో వున్న కృష్ణుడు అతనితో "నీకే కాదు, నన్ను గోపికల నుండి కాపాడిన ఈ కుండకు కూడ మోక్షము ఇస్తున్నాను" అని మాట ఇచ్చాడు. అలాగ వాళ్ళకు మోక్ష ప్రాప్తి జరిగిందని చెప్పబడింది.

ఎన్నో శతాబ్దాల తరువాత జరిగిన సంఘటన. పిళ్ళై పెరుమాళ్ అయ్యంగార్ అనే ఒక కవి విష్ణు దర్శనానికి శ్రీరంగం దేవాలయానికి వెళ్ళారు. దర్శన సమయంలో "నాకు నీవు మోక్షాన్ని ప్రసాదించ వలసిందే" అని గట్టిగా పట్టుబట్టాడు. అక్కడ గర్భగుడిలో విష్ణుమూర్తి ఆదిశేషునిపై విశ్రమించిన తీరులో ఉంటారు. స్వామి అంత సాహస, ధైర్యాలతో తనను నిర్బంధిస్తున్న వ్యక్తి ఎవరని చూడడానికి లేచి కూర్చున్నాడు. తక్షణ మోక్షప్రాప్తికి అతనికి అర్హత ఏమిటని అయ్యంగార్‌ను అడిగాడు. అయ్యంగార్ "నాకు ఏ అర్హతలు లేవు. కాని నీవు దధిపాండన్ ఇంట్లో ఒక కుండకు మోక్షాన్ని ఇచ్చావు. నేను ఆ కుండ కంటే ఎక్కువ అర్హత గలవాడినే! నా కోరిక నీవు తప్పక మన్నించవలసిందే" అన్నాడు. దాంతో స్వామి నివ్వెరబోయి ఆలోచించ డానికి నడుము వాల్చాడు. అంతే, అప్పటి నుండి తిరిగి లేవలేక అలాగే ఉండిపోయాడట.

*అనువాదం: విడపనకంటి*

## మనవి

రమణజ్యోతి పత్రికలో ప్రచురితమయ్యే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు కేవలం రచయితల సొంతవి మాత్రమే. పత్రిక యాజమాన్యం, సంపాదక వర్గాలకు వీటితో ఎలాంటి సంబంధం లేదు.

## గమనిక

దయచేసి మీరు మీ మొబైల్ నంబర్‌ను తెలుపగలరు. పత్రికకు మీ చందా మొదలు మరియు ముగిసే తేదీ వివరాలు ఎస్.ఎమ్.ఎస్. ద్వారా తెలుపుటకు మాకు వీలగును.

# రమణునిలో రమణీయార్థాలు

**ఆచార్య విజయ శ్రీ కుప్పా**

అరుణాచలం అన్న పేరు వినగానే మనసంతా కరుణార్ద్రమై ఎవరు నిలువెల్లా కదిలిపోయారో వారే రమణ మహర్షి. 1879 సం॥లో వెంకట రామన్ అన్న పేరుతో తమిళనాడులోని 'తిరుచ్చుళి' గ్రామంలో జన్మించిన వ్యక్తి 1895 నవంబరు నెలలో రమణమహర్షిగా పేరు పొందారు. ఎన్నో సంవత్సరాలు అరుణాచలంలో కొండమీదున్న స్కంద గుహలో మౌనస్వామిగా ధ్యానం చేసుకుంటున్న స్వామిని 1907 వ సం॥లో శ్రీ కావ్యకంఠ గణపతి అనే మహా పండితుడు దర్శించుకుని 'సాధన' విషయంలో తన కున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారట. కావ్యకంఠ గణపతులవారే రమ్యంగా రసపూర్ణంగా రమణీయార్థ ప్రతి బోధకంగా వారు చెప్పిన సమాధానాలు విన్న తరువాత రమణమహర్షి అని సంబోధించారట. రమణగీత, రమణాశ్రమ లేఖలు ఉపదేశసారం వంటి మహర్షి గ్రంథాలు భక్తులకు మోక్ష మార్గాన్ని చూపించే తత్వజ్ఞాన దీపికలు. 'ఉండిపర' అనే ఛందస్సుతో తమిళంలో 30 శ్లోకాలు కూర్చి వాటినే సంస్కృతంలోకి ''ఉపదేశసారం'' పేరుతో స్వయంగా అనువదించిన ఘనత రమణులవారిదే! ఇందులో ప్రతి సూత్రానికీ వ్యాఖ్యానం రాస్తే మరో గ్రంథమవుతుంది. గ్రంథాన్ని ప్రాచుర్యం లోకి తెచ్చింది దయానంద సరస్వతి స్వామివారే! ఉపదేశసార గ్రంథంలో ప్రారంభ శబ్దమే ''కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలమ్'' అన్న ఆదేశానుసార తత్వం కనిపిస్తుంది. సంప్రదాయానుసారంగా 'ఓమ్-అథ' అన్న రెండు శబ్దాలు శాస్త్ర ప్రారంభ పదాలుగా వ్యవహరిస్తారు.

ఇక్కడ రమణులవారు 'కర్త' అనే శబ్దంతో సృష్టికర్త అయిన పరమాత్మని స్మరిస్తూ మంగళవాక్యాన్ని నాందీ సంప్రదాయంగా వాడారని

గ్రహించవచ్చు. మొట్టమొదట 'కర్త' శబ్దం ఆజ్ఞని జారీ చేసింది తన చేతనే కర్మఫలం పొందబడాలని, మరి కర్మకి స్వతంత్ర్య ప్రతిపత్తి లేదా అంటే లేదుగాక లేదు. ''కర్మ బుద్ధ్యానుసారిణి - బుద్ధి తాత్కాలికీ జ్ఞేయి''. ఇటువంటపుడు ''కర్మ'' జీవుల చేత ఆచరింపబడే ఒక క్రియ అనీ, ఆ క్రియని నిర్దేశించేది ఈశ్వర రూపంలో ఉన్న కర్త అని మనం అంగీకరించాలి. అయితే మనం చేసే ప్రతి కర్మ మన ఇష్టానుసారం జరగనపుడు మనం ఇష్టపూర్వకంగానో, కష్టపూర్వకంగానో ఇన్ని కర్మలు ఎందుకు చేయాలీ అంటే దానికి సమాధానం మహర్షి ఇలా చెబుతున్నారు. ''కర్మ కిం పరమే? కర్మ తజ్జడమ్'' కర్మ జడ స్వభావము కలది.

కర్మ ద్వారా ఫలం - ఫలం ద్వారా సుఖ దుఃఖాలు లభిస్తాయి. మరి సుఖ కర్మలంటూ ప్రత్యేకించి ఉన్నాయా అంటే లేవు మరి. ఎందుకంటే సుఖం తాత్కాలికం. సుఖం అజ్ఞానం దుఃఖం కూడా అజ్ఞానమే. మరి కర్మవల్ల ఏ రకమైన హామీ దొరకనపుడు కర్మలకి వ్యతిరేకిగా ఉండచ్చుగా! ఊహూ.... అదీ లాభం లేదు!! నిత్య నైమిత్తిక, దేవ, పితృ కార్యాలన్నింటిలో కర్తృత్వం మాత్రమే వహించగలం కానీ కర్మ ఫలానికి హామీదారులం కాలేము. కర్మ చేయించే వాడు కర్తని సృష్టించే వాడు. కర్మ ఫలాన్ని నిర్ణయించే వాడు ఈశ్వరుడే. అతడే కర్త!! అతడే సృష్టికర్త!! కర్మఫల నిర్దేశకుడు, పుణ్యాపుణ్య ఫలాప్రాప్తి నిర్ణేత కూడా అతడే.

కర్మ ఆద్యంతాలు కనిపెట్టడం ఎవరి వల్లా కాదు. అందుకే ''కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన'' అన్న గీతాచార్యుడి విశ్లేషణని ఆలోచిస్తే కర్మ గురించి ఆలోచించి కర్తృత్వాన్ని ఫలాపేక్షనీ అనాలోచితం చేయచ్చు. అపుడే దొరుకుతుంది శాంతి!! కర్మ అనివార్యం. జన్మ తీసుకున్న తరువాత అసంకల్పితంగా కూడా కర్మలు

చేస్తాం - ఆ కర్మని మనం చేయలేదనుకుని చేస్తే ప్రశాంతత లభిస్తుంది. ఒక భక్తుడు శాంతి ఎలా లభిస్తుందని ప్రశ్నిస్తే, రమణ మహర్షి "సుమ్మాయిరప్ప" అన్నారట. తమిళ భాషలో దానర్థం ఊరికే ఉంటే శాంతి లభిస్తుందని - ఇది కాదని ఊరిలో ఉన్నదంతా నెత్తికి ఎత్తుకుంటే అశాంతి. కనుక శాంతి మనిషి అంతర్భాగమని తనకు తానుగా సృష్టించుకునేదనీ మనిషి గ్రహించాలి. శాంతి, సంతృప్తి, బయట కొనుక్కునే పదార్థాలు కావు! ఈ విషయం తెలుసుకోటానికి జ్ఞానం కావాలి. ఆ జ్ఞానసముపార్జనకి రమణులు వారు అత్యంత రమణీయంగా వివరించిన వేదాంతరసాన్ని ఆస్వాదించండి! "బుద్ధి మత్సునరాశ్రేష్ఠా" అన్నారు. బుద్ధి వికసించిన జీవులలో నరుడే ఉత్తముడు. ఆ నరుడికి మాత్రమే మేధాశక్తి ఉంది. దాన్ని ఉపయోగించుకుని జ్ఞానతృష్ణను పెంపొందించుకోవాలి. "నహి జ్ఞానేనసదృశం పవిత్ర మిహవిద్యతే" - జ్ఞానం పవిత్రమైనది కనుకనే దానితో సమానమైన విద్య ఎక్కడా లేదు. అర్థంకాని మంత్రాలను చదివి తాను భక్తుడినను కునే దానికన్నా మంత్రార్థం తెలుసుకున్న జ్ఞానంతో భగవంతుడిని సరియైన దిశలో దర్శించ గలగాలి. భగవంతుడంటే కోరికలు తీర్చే వాడన్నది సత్యం. భగవంతుడంటే కోరికలు లేకుండా చేసేవాడన్నది కూడా సత్యం, ఈ రెండింటికీ తేడా తెలియటమే జ్ఞానం. అందుకే జ్ఞానాన్ని మించిన దైవం లేదన్నది ఒక తత్వం. ఆ తత్వాన్వేషణే జీవితం - ఇది తెలిసిన భారతీ తీర్థస్వాముల వారు ఎలా వేదన చెందారో చూడండి.

అజ్ఞాన తిమిర వాదమ
భిజ్ఞుల హృదయాంతరముల ప్రేరేపింపన్
విజ్ఞాన కాంతియని కిం
చిజ్ఞని మోసముఁజేయ చెలగిరిదేవా (శివసాహస్రి)

# భక్త జయమాలుని కథ

- అనువాదం: మల్లాది ఫణిమాల

వైష్ణవుల గ్రంథమైన భక్తమాల యందు కృష్ణ భక్తుడైన రాజు జయమాలుని గురించి ఒక పురాతన కథ యున్నది. జయమాలుడు కృష్ణుని శ్యామల సుందరుడా (అనగా నల్లని అందమైన రూపము కలవాడా) అని పూజించెడివాడు. అతడు శ్యామల సుందరునకు సంపూర్ణ శరణాగతుడైన భక్తుడు. అతని మనసు నందు దేవుడు లేడనే అపనమ్మకము లేశమాత్రమైనను లేదు. ఆ రాజు రోజునందు సగ భాగము శ్యామసుందరుని పూజతోను, మిగిలిన భాగము తాను శ్యామ సుందరునిదిగా భావించే రాజ్యపాలనను చూచెడివాడు.

రాజు జయమాలుడు కృష్ణుని పూజా సమయమందు పూర్తి భక్తి ప్రపత్తులు కలిగినవాడై, రాజుగాకాక, సామాన్య భక్తుని వలె నుండి ఎట్టి అత్యవసర పరిస్థితి యందును తనకు ఆటంకము కల్గించరాదని గట్టి ఉత్తర్వులు ఇచ్చి, పూజకు ఉపక్రమించెడివాడు.

భక్తుడు పూర్ణ భక్తితో దేవుని పూజయందు నిమగ్నమై యుండగా అప్పుడు కలిగెడు అనుగ్రహము యొక్క అనుభూతి వర్ణింప జాలనిది, మరియు ఏ రాజ్యాధిపత్యము కన్నను మిన్న.

పొరుగు రాజ్యపు రాజు జయమాలుని రాజ్యముపై కన్నేసి ఉంచెను. ఒకరోజు జయమాలుని పూజా నియమమును తెలుసుకొనిన ఆ రాజు జయమాలుడు ఉదయం పూజయందు నిమగ్నుడై యుండగా దండెత్తి వచ్చెను. జయమాలుని మంత్రులు మార్గదర్శనమునకై రాజును సంప్రదించిరి. కాని రాజు పరిస్థితిని సమీక్షించుటకు అంగీకరించక భారము నంతయు కృష్ణునిపై వేసెను. ఆ రాజు మంత్రులతో ''ఈ రాజ్యము నాకు నా దైవమైన కృష్ణునిచే అనుగ్రహించ బడినది. మరియు ఈ రాజ్యమును నా నుంచి తీసుకొనుటకు భగవంతుడు

నిర్ణయించినట్లయిన నేనేమియు చేయలేను. మరియు భగవంతుని దీవెనలు నాయందు ఉన్నట్లయిన ఇక ఎవ్వరును నాకు హాని చేయలేరు'' అని నొక్కి చెప్పెను.

అందువలన జయమాలుడు శ్యామసుందరుని పూజించుచునే యుండెను. మంత్రివర్గము కూడా మధ్యాహ్నము రాజు పాలనా బాధ్యతలు తీసుకునేవరకు వేచియుండిరి. ఒక నిజమైన భక్తుడు చిన్న పిల్ల వానివలె బాధ్యతలు అన్నియు భగవంతునిపై వేయగా, అప్పుడు ఆ భగవంతుడే ఆ భక్తునియొక్క జీవితమును, యోగక్షేమములను చూచుటకు పూను కొనును. భక్తునకు ఏది మంచిదో అది అంతయు భగవంతుడు చేయును. ఆ రోజు జయమాలుని విషయమందు అట్లే జరిగెను. శ్యామల సుందరుడే రాజు అశ్వమును తీసుకుని యుద్ధరంగ మునకు వెళ్ళెను. శ్యామలసుందరుడే శతృసైన్యమంతటిని సంహ రించెను. ఇంతలో జయమాలుని పూజ పూర్తికాగా రణరంగమునకు వెళ్ళెను. అక్కడ రాజు అశ్వము రొప్పుతూ చెమటలు క్రక్కుచుండెను. మరియు శత్రురాజు ''యుద్ధము చేసిన నీలియోధుడు ఈతనిని మాత్రము విడిచి తన సైన్యమంతయు నాశనము చేసి, విషయము జయమాలునకు తెలుపుటకే తనను సంహరించక మిగిల్చెననెను. ఇప్పుడా శత్రురాజునకు తన సంపదయందును, రాజ్యమందును ఏ మాత్రము ఇష్టము లేకుండెను. ఆ శత్రు రాజు, ఆ నీలియోధుడు ఎవరైతే తన హృదయమందు క్షణకాలంలో చెరగని ముద్రవేసి, తనను వశపర్చుకున్నాడో అతని గురించి మాత్రము తెలుసుకొన దలచెను. అప్పుడు రాజు జయమాలునకు తన భగవంతుడైన శ్యామల సుందరుడే తనకు బదులుగా యుద్ధము చేసెనని అర్థమయ్యెను. శత్రురాజు జయమాలుని పూజించి అతని ఆశీస్సుల ద్వారా భగవంతుడైన కృష్ణుని కృపకు పాత్రుడాయెను. భగవంతుని చేరుటకు శరణాగతిని మించిన మార్గములేదని భగవాన్ శ్రీరమణులు కూడా నొక్కి వక్కాణించినారు.

# The Five Modes of Mind and Self-Enquiry

D. Samarender Reddy

There are only five states or modes in which a mind can be: (1) Mode of sense perception, (2) Mode of thinking, (3) Vacant mode, (4) Sleeping mode, and (5) Thought-free consciousness mode. All of these modes are to some extent mutually exclusive in that the mind can be in only one of these modes at any point in time and the mind cannot subsist simultaneously in two or more of these modes. Which of these modes prevails is dependent on a number of factors, but we will not go into them. We will restrict our attention to what these modes are and how they relate to self-enquiry taught by Sri Ramana Maharshi.

## Mode of Sense Perception

We have five senses – sense of sight, hearing, smell, taste and touch. The mind is made aware of the world through these five senses. When the mind is absorbed in perceiving the world through one or more of these senses, the sense data in the form of beauty or ugliness, loudness or silence, sweetness or bitterness, fragrance or malodour, hardness or softness, impinge on the mind and the mind is made aware of such sense data. Thus we get knowledge of the surroundings or the external world. Of course, since the body forms a part of the external world, sense data from the body can also stream into the mind. When we are thus aware of the sense perceptions, there is little scope for the rise of other modes of the mind, much less the thinking mode.

There is the anomalous case of sense perceptions during dreaming. Although they seem to be due to the contact of sense organs of the dream-body with the "external" dream-world, they are, strictly speaking, "perceptions" generated internally by the mind itself.

## Mode of Thinking

Like sense perception, the mode of thinking is also enough known, but we will elaborate a bit. All thinking is characterized by the presence of thoughts, be they rapid or slow, clear or muddled, rational or irrational. That is, the nature of thoughts may vary but whenever thoughts hold the attention of the mind, the mode of thinking is underway for the mind. To be sure, this mode of mind seems crucial and indeed vital for our very survival – at least that is how it seems to the unenlightened beings that most of us are, but going by the accounts of the enlightened sages, it would seem that their minds do not dwell any length of time in the mode of thinking. What's more, the enlightened sages go even to the extent of saying they do not have a mind to speak of and their body functions directly by the light and intelligence of pure consciousness or Self that they in actuality are. But we lesser mortals view our thinking mind as our most prized possession. Be that as it may, we will have more to say about it when our discussion turns to self-enquiry below.

